# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 06-05-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రేపు దేశవ్యాప్తంగా 244 జిల్లాల్లో (మాక్ డ్రిల్) పౌర రక్షణ విన్యాసాలను నిర్వహించనుంది.
- ❖ భారత్, ఇంగ్లాండ్ దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది.
- ❖ భారత నావికా దళాలు గగన్‌యాన్ మిషన్ లో కీలక పాత్ర పోషిస్తున్నాయని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.
- ❖ భారత్ లో మొబైల్ వినియోగదారుల సంఖ్య 120 కోట్లకు చేరుకుందని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు.

==============================

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రేపు దేశవ్యాప్తంగా 244 జిల్లాల్లో (మాక్ డ్రిల్) పౌర రక్షణ విన్యాసాలను నిర్వహించనుంది. కేంద్ర హోం మంత్రిత్వ కార్యదర్శి గోవింద్ మోహన్ ఈరోజు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులతో దృశ్య మాధ్యమ విధానంలో రేపు జరగనున్న మాక్ డ్రిల్ సన్నాహాలను సమీక్షించారు. ఈ సమావేశంలో సివిల్ డిఫెన్స్ డైరెక్టర్ జనరల్స్, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళంతో పాటు దేశ రాజధానిలోని ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. గ్రామ స్థాయి వరకు విస్తరించనున్న ఈ మాక్ డ్రిల్ అధికారులు, వాలంటీర్లు, NCC, NSS, విద్యార్థులతో కూడిన పౌర రక్షణ దళాల సంసిద్ధతను అంచనా వేస్తుంది.

==============================

హైదారాబాద్ నగర వ్యాప్తంగా రేపు 'ఆపరేషన్ అభ్యాస్' పేరుతో డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం 4 గంటల 15 నిమిషాలకు నగరంలోని నాలుగు చోట్ల (సికింద్రాబాద్, గోల్కొండ, కంచన్‌బాగ్ డీఆర్‌డీవో, మౌలాలి ఎన్ఎఫ్‌సీలో) మాక్ డ్రిల్ నిర్వహిస్తారు. నగరమంతా సైరన్ మోగిస్తారు. సైరన్ వినిపించగానే బహిరంగ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు తెలియజేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలనే విషయాలను ఈ మాక్ డ్రిల్ లో ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ ఇంగ్లాండ్ దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా ఇంగ్లాండ్ ప్రధానమంత్రి కియర్ స్టార్మర్‌తో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోన్ లో మాట్లాడారు. పరస్పరం ప్రయోజనకరమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని విజయవంతంగా ముగించడంపై నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం భారత్ - ఇంగ్లాండ్ దేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా పెంచుతుందని.. ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలలో వాణిజ్యం, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనలో ఆవిష్కరణలను వేగవంతం చేస్తుందని సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత నావికా దళాలు గగన్‌యాన్ మిషన్ లో కీలక పాత్ర పోషిస్తున్నాయని కేంద్ర అంతరిక్ష, అణుశక్తి శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు ఆయన పాత్రికేయుల సమావేశంలో గగన్ యాన్, డీప్ సీ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను 2026లో చేపడుతున్నామని తెలిపారు. PM గతి శక్తి, స్వమిత్రా, స్మార్ట్ సిటీస్, అమృత్ వంటి జాతీయ కార్యక్రమాలలో స్పేస్, డ్రోన్ టెక్నాలజీల పెరుగుతున్న వినియోగాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ సాంకేతికతలను రైల్వేలు, ఆరోగ్య సంరక్షణ విపత్తు నిర్వహణ వంటి రంగాలలో కూడా అనుసంధానం చేస్తున్నామని తెలిపారు. భారత్ చేపడుతున్న ప్రాజెక్టులతో 2026 ఒక మైలురాయి సంవత్సరంగా నిలవబోతోందని జితేంద్ర సింగ్ పేర్కొంటూ…

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

స్మార్ట్ ఫోన్స్ నేడు సాధికారతకు సాధనాలుగా పని చేస్తున్నాయని సమాచార ప్రపంచానికి ముఖద్వారాలుగా మారిపోయాయని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖా మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. న్యూఢిల్లీలో భారత్ టెలికాం-2025 22వ ఎడిషన్ ను ఈరోజు ఆయన ప్రారభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ…. భారత్ ప్రపంచంలో 2వ అతిపెద్ద టెలికాం మార్కెట్‌గా అవతరించిందన్నారు. దేశంలో మొబైల్ వినియోగదారుల సంఖ్య 120 కోట్లకు చేరుకుందని చెప్పారు. ఇంటర్నెట్ వినియోగదారులు 250 మిలియన్ల నుండి 970 మిలియన్లకు పెరిగారని మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వివరిస్తూ…

(వాయిస్ 38 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇటలీలోని మిలాన్ నగరంలో జరుగుతున్న ఆసియా డెవలప్మెంట్ బ్యాంక్ వార్షిక సమావేశం సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటాలియన్ ఆర్థిక మంత్రి జియాన్‌కార్లో గియోర్గెట్టి తో సమావేశమయ్యారు. భారత్ - ఇటలీ ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడంపై ఇరువురు ఈ సందర్భంగా చర్చించారు. అనంతరం జరిగిన ఒక కార్యక్రమంలో భారతీయ ప్రవాసులను ఉద్దేశించి ప్రసంగించారు. భారతదేశంలో సమ్మిళిత వృద్ధి నిర్ధారించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను నిర్మలా సీతారామన్ వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికల తేదీలను 4 వారాల్లోగా ప్రకటించాలని సుప్రీం కోర్టు ఆ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఇతర వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన వ్యాజ్యం కారణంగా 2022 నుండి ఆ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోయాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ అవసరాలకు సరిపోయే నైపుణ్య యువత భారతదేశంలో ఉందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతిభకు చాలా డిమాండ్ ఉందని దానిని తీర్చడానికి భారతదేశం సిద్ధంగా ఉందని అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన "గ్లోబల్ యాక్సెస్ టు టాలెంట్ ఫ్రమ్ ఇండియా" (GATI) ప్రారంభోత్సవంలో డాక్టర్ జైశంకర్ మాట్లాడుతూ... శ్రామిక అవసరాల దృష్ట్యా విదేశాలలో అవకాశాలపై ఎక్కువగా దృష్టి పెట్టాలని యువతకు సూచినచారు. సమకాలీన యుగంలో భారతీయ శ్రామిక శక్తి మరింత ఉత్పాదకంగా ఉండటానికి ప్రభుత్వం అనేక రకాల నైపుణ్య శిక్షణ, వృత్తి విద్య ప్రయత్నాలను ప్రారంభించిందని మంత్రి వెల్లడిస్తూ ...

(వాయిస్ 37 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆస్తమా నిర్వహణకు ముందస్తు రోగ నిర్ధారణ, సరైన చికిత్స చాలా కీలకమని కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జె.పి. నడ్డా అన్నారు. ఆస్తమా గురించి అవగాహన పెంచడానికి దీర్ఘకాలిక పరిస్థితితో జీవిస్తున్న వారికి సంరక్షణను పెంచడానికి ప్రపంచ ఆస్తమా దినోత్సవం కీలకమైన వేదికగా పని చేస్తుందని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు. దేశంలో ఆస్తమా సంబంధిత సమస్యలను తగ్గించడానికి శ్వాసకోశ ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి ఆరోగ్య సంరక్షణ నిపుణులు సమాజాలు సమిష్టిగా పనిచేయాలని మంత్రులు కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 80 వేల 796 స్వల్ప లాభాల్లో ప్రారంభమై... చివరికి 155 పాయింట్ల నష్టంతో 80 వేల 641 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 81 పాయింట్ల నష్టంతో 24 వేల 379 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.43గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 61.88 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3 వేల 391 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో భాగంగా ఈరోజు ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత బ్యాటింగ్ చేస్తున్న ముంబై ఇండియన్స్ జట్టు 11 ఓవర్లు పూర్తయ్యే సరికి 3 వికెట్ నష్టానికి 98 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =